## రెడింగ్టన్‌లో ఐఫోన్16పై ఆఫర్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 21: దేశవ్యాప్తంగా యాపిల్ ఫోన్లను విక్రయిస్తున్న రెడింగ్టన్.. ఐఫోన్లపై భారీ రాయితీ కల్పిస్తున్నది. ఇటీవల మార్కెట్లోకి విడుదల చేసిన ఐఫోన్ 16ఈపై పలు బ్యాంకుల కార్డులపై రూ.4 వేల వరకు ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్‌ను అందిస్తున్నట్లు తెలిపింది. ఐసీఐసీఐ బ్యాంక్, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఎస్బీఐ బ్యాంకులకు చెందిన క్రెడిట్ కార్డులతో కొనుగోలు చేసిన వారికీ ఈ ప్రత్యేక ఆఫర్ వర్తించనున్నది. అలాగే రూ.6 వేల వరకు ఎక్స్చేంజ్ బోనస్ పొందవచ్చును.

## తగ్గిన ఫారెక్స్ నిల్వలు

ముంబై, ఫిబ్రవరి 21: మూడు వారాలుగా పెరుగుతూ వచ్చిన విదేశీ మారకం నిల్వలు మళ్లీ కరిగిపోయాయి. ఈ నెల 14తో ముగిసిన వారాంతానికిగాను ఫారెక్స్ రిజర్వులు 2.54 బిలియన్ డాలర్లు తరిగిపోయి 635.721 బిలియన్ డాలర్లకు పరిమితమైనట్లు రిజర్వుబ్యాంక్ వెల్లడించింది.

# ఆరేండ్లలో రద్దీ రెట్టింపు

**2030-31కి హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ఐదు కోట్ల ప్రయాణీకులు: జీఎమ్మార్**

**కార్గో టెర్మినల్ విస్తరణకు రూ.370 కోట్ల పెట్టుబడి**




హైదరాబాద్, ఫిబ్రవరి 21: హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో రాబోయే ఆరేండ్లలో ప్రయాణీకుల రద్దీ దాదాపు రెట్టింపు కానుందని జీఎమ్మార్ గ్రూప్ అంచనా వేస్తున్నది. ఇక్కడి రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని (ఆర్‌జీఐఏ) జీఎమ్మార్ గ్రూప్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే జీఎమ్మార్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్‌ఐఏఎల్) సీఈవో ప్రదీప్ ఫణికర్ పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 2030-31నాటికి హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ప్యాసింజర్ ట్రాఫిక్ ఏటా 50 మిలియన్ల (5 కోట్లు) కు చేరవచ్చన్నారు. ప్రస్తుతం 29 మిలియన్లు (2.9 కోట్లు)గా ఉండొచ్చని చెప్పారు. 'దేశంలోని మెట్రో నగరాల్లో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఎయిర్‌పోర్టుల్లో హైదరాబాద్ ముందున్నది. గత ఏడాది మార్చికల్లా విమానాశ్రయంలో ప్రయాణీకుల రద్దీ 2.5 కోట్లుగా ఉన్నది. ఈ ఏడాది మార్చి ఆఖరుకు 2.9 కోట్లుగా రికార్డు కాగలదు. 2031 మార్చి 31 నాటికి ఇది 5 కోట్లను తాకుతుందని నమ్ముతున్నాం.' అని ప్రదీప్ తెలియజేశారు. నిజానికి ఇప్పటికే ఏటా 4 కోట్ల ప్రయాణీకుల రద్దీని తట్టుకునేలా ఎయిర్‌పోర్టులో కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలను దశలవారీగా అభివృద్ధిపర్చినట్లు చెప్పారు. 2008లో 1.2 కోట్ల ప్రయాణీకుల రద్దీ సామర్థ్యంతో ఈ ఎయిర్‌పోర్టును నిర్మించిన సంగతి విదితమే. కాగా, 2023తో పోల్చితే గత ఏడాది ఎయిర్‌పోర్టుకు 36 లక్షల ప్రయాణీకులు పెరిగారని ప్రదీప్ వివరించారు. ఢిల్లీలో మినహా దేశంలోని మరే ఇతర ఎయిర్‌పోర్టుల్లోనూ ఈ స్థాయి పెరుగుదల లేదని గుర్తుచేశారు.

**కార్గో టెర్మినల్ విస్తరణ**

ఎయిర్‌పోర్ట్‌లో ప్రస్తుతమున్న కార్గో టెర్మినల్‌ను దాదాపు రూ.215 కోట్లతో విస్తరించే దిశగా వెళ్తున్నామని, రూ.155 కోట్లతో కొత్తగా మరో టెర్మినల్ నిర్మించబోతున్నామని మొత్తం రూ.370 కోట్ల పెట్టుబడి పెట్టనున్నామని ప్రదీప్ ఈ సందర్భంగా వెల్లడించారు. నూతన టెర్మినల్‌తో వార్షిక సామర్థ్యం 4 లక్షల టన్నులకు చేరగలదన్నారు. మే నెలలో నిర్మాణం పూర్తి కావచ్చని, జూన్ లేదా జూలైనాటికి అందుబాటులోకి రావచ్చన్నారు. కాగా, ఈ విమానాశ్రయంలో ప్రస్తుతం గంటకు 34-35 విమానాల రాకపోకలు జరుగుతున్నాయని, 42దాకా కూడా వచ్చిపోయే సామర్థ్యం ఇక్కడి రన్‌వేలకు ఉందని చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం (2023-24) రూ.2,700 కోట్ల కుపైగా ఏకీకృత నిర్వహణ ఆదాయాన్ని అందుకున్నామని, ప్రయాణీకుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా రాబోయే సంవత్సరాల్లో 10 శాతం వృద్ధిని అంచనా వేస్తున్నట్టు వెల్లడించారు. అయితే 65-70 శాతం ఏరోనాటికల్ వైపు నుంచే ఆదాయం వస్తున్నదన్న ఆయన ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) 1.80 లక్షల టన్నుల కార్గో రవాణా జరుగవచ్చన్న ఆశాభావాన్ని కనబర్చారు. ఇది గతంతో పోల్చితే 20 శాతం ఎక్కువ. ఇక అంతర్జాతీయ షిప్పింగ్ నుంచే మెజారిటీ ఆదాయం వస్తున్నది. ఎర్ర సముద్రంలో సంఘర్షణలతో ఇంటర్నేషనల్ కార్గో పెరిగిందన్నారు. కాగా, జీహెచ్‌ఐఏఎల్‌లో జీఎమ్మార్ గ్రూప్‌నకు 74 శాతం వాటా ఉంటే.. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, తెలంగాణ ప్రభుత్వాలకు 13 శాతం చొప్పున వాటాలున్నాయి.




### హైదరాబాద్ టూ మదీనా

హైదరాబాద్ నుంచి సౌదీ అరేబియాలోని మదీనాకు నూతన విమాన సర్వీసులను ఇండిగో ఎయిర్‌లైన్స్ శుక్రవారం ప్రారంభించింది. వారంలో మూడు రోజులపాటు ఈ విమానాలు నడుస్తాయి. సోమ, గురు, శనివారాల్లో ఈ సర్వీసులుంటాయి. ప్రయాణ సమయం 5 గంటల 47 నిమిషాలు. ఈ సర్వీసులతో మిడిల్‌ఈస్ట్‌కు దక్షిణాసియా, ఆగ్నేయాసియాల నుంచి వెళ్లే ప్రయాణీకులకు హైదరాబాద్ చక్కని వేదిక కాగలదన్న విశ్వాసాన్ని ఎయిర్‌పోర్ట్ సీఈవో ప్రదీప్ ఫణికర్ వెలిబుచ్చారు.




## కియా సెల్టోస్ 2025 వెర్షన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: సరికొత్త సెల్టోస్‌ను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది కియా ఇండియా. పాతదాంతో పోలిస్తే ఈ నయా వెర్షన్‌ను భారీ మార్పులు చేసినట్లు, ముఖ్యంగా టెక్నాలజీ పరంగా యువతను ఆకట్టుకునే విధంగా డిజైన్ చేసినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ కారు రూ.11.13 లక్షల నుంచి రూ.20.5 లక్షల లోపు ధరల శ్రేణిలో లభించనున్నది. ఎనిమిది అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్, ఎల్‌ఈడీ హెడ్‌లైట్స్, ఎల్‌ఈడీ ఫాగ్ ల్యాంప్స్, గ్లాస్ బ్లాక్ ఎక్స్‌టీరియర్, ఆరు స్పీకర్ ఆడియో సిస్టమ్, స్టీరింగ్-మౌంటెడ్ కంట్రోల్స్, టైప్-సీ చార్జింగ్ పోర్ట్, రియర్ ఏసీ వెంట్స్, 1.5 లీటర్ల పెట్రోల్, టర్బో పెట్రోల్, టర్బో డీజిల్ ఇంజిన్‌తో తయారు చేసింది.


## గ్రాన్యూల్స్ చేతికి స్విస్ సంస్థ

**రూ.192 కోట్లతో కొనుగోలు చేసిన హైదరాబాదీ కంపెనీ**

హైదరాబాద్, ఫిబ్రవరి 21: రాష్ర్టానికి చెందిన ప్రముఖ ఫార్మా దిగ్గజం గ్రాన్యూల్స్ ఇండియా దూకుడు పెంచింది. కాంట్రాక్స్ రీసర్చ్-డెవలప్‌మెంట్ అండ్ మానుఫ్యాక్చరింగ్(సీడీఎంవో) విభాగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి స్విట్జర్లాండ్‌కు చెందిన సెన్న్ కెమికల్స్ ఏజీని కొనుగోలు చేసింది. ఒప్పందం విలువ స్విట్జర్లాండ్‌కు చెందిన కరెన్సీ సీహెచ్‌ఎఫ్ 20 మిలియన్లు. మన కరెన్సీలో రూ.192 కోట్లకు పైమాటే. అంతర్జాతీయ కస్టమర్లను ఆకట్టుకోవడానికి, సీడీఎంవో సేవలను మరింత విస్తరించాలనే ఉద్దేశంతో ఈ కొనుగోలు జరిపినట్లు కంపెనీ సీఎండీ కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ కొనుగోలు ఒప్పందం ఈ ఏడాది తొలి అర్ధభాగం నాటికి పూర్తికాగలదనే విశ్వాసాన్ని ఆయన వ్యక్తంచేశారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న థెరపెటిక్స్ సెగ్మెంట్‌తోపాటు సీడీఎంవో విభాగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోనున్నట్లు ప్రకటించారు. చికిత్సా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆవిష్కరణలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు.

## ఆర్థిక వ్యవస్థకు కొత్త సవాళ్లు

**పెరుగుతున్న అన్‌సెక్యూర్డ్ రుణాలు, ఊహాజనిత ట్రేడింగ్‌పై ఆర్బీఐ డీజీ ఆందోళన**



ముంబై, ఫిబ్రవరి 21: వ్యక్తిగత, క్రెడిట్ కార్డ్, విద్యార్థి తదితర తాకట్టులేని రుణాలు పెరుగుతుండటం, క్యాపిటల్ మార్కెట్లలో ఉత్సాహంగా నడుస్తున్న ఊహాజనిత డెరివేటివ్స్ ట్రేడింగ్‌లు ఆర్థిక వ్యవస్థకు కొత్త సవాళ్లను తెచ్చిపెడుతున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) డిప్యూటీ గవర్నర్ ఎం రాజేశ్వర్ రావు ఒకింత ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో వేగంగా విస్తరిస్తున్న డిజిటల్ ఎకానమీతో అవకాశాలూ.. ఇబ్బందులూ రెండూ ఉన్నాయన్నారు. శుక్రవారం ఇక్కడ సూక్ష్మ ఆర్థిక, బ్యాంకింగ్, ఫైనాన్స్ అంశాలపై ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) కోజికోడ్, నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వల్పకాలిక లాభాలపై ఉత్సుకత.. వ్యక్తుల్లో దీర్ఘకాలిక ఆర్థిక భద్రతను కనుమరుగయ్యేలా చేస్తున్నదన్నారు. అందుకే ఆర్థిక సంస్థలు రుణాల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉండకూడదని, కస్టమర్లకూ ఆర్థికపరమైన విషయాల్లో ఉన్న రిస్కులను తెలియజేసి.. వారిలో అవగాహనను పెంచాలని సూచించారు. మోసాల నుంచి వినియోగదారులను రక్షించడంలో ఆర్థిక అక్షరాస్యతే కీలకమన్నారు.

# ఆగని సూచీల నష్టాలు

**సెన్సెక్స్ 425, నిఫ్టీ 117 పాయింట్లు డౌన్**



ముంబై, ఫిబ్రవరి 21: స్టాక్ మార్కెట్ల నష్టాల పరంపర కొనసాగుతున్నది. వరుసగా నాలుగో రోజూ శుక్రవారం కూడా సూచీలు భారీగా నష్టపోయాయి. వాహన, ఫార్మా, బ్యాంకింగ్ రంగ షేర్లలో అమ్మకాలు భారీగా జరగడం, విదేశీ నిధుల తరలింపు కొనసాగుతుండటంతో మదుపరులు అమ్మకాల బటన్ నొక్కారు. ఫలితంగా వారాంతం ట్రేడింగ్‌లో ఇంట్రాడేలో 600 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 424.90 పాయింట్లు కోల్పోయి 75,311 వద్ద నిలిచింది. మరోసూచీ నిఫ్టీ 117.25 పాయింట్లు పతనం చెంది 22,795.90 వద్ద నిలిచింది. గత నాలుగు రోజుల్లో సెన్సెక్స్ 685.8 పాయింట్లు, నిఫ్టీ 163.6 పాయింట్ల చొప్పున నష్టపోయాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధుల తరలింపుకొనసాగుతుండటం, అమెరికా టారిఫ్ పెంపు ప్రతిపాదనలో మదుపరుల్లో ఆందోళన నెలకొన్నదని మెహతా ఈక్విటీస్ లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ తాప్సీ తెలిపారు. ఐటీ, టెలికం, వాహన, రియల్టీ, ఆయిల్‌అండ్ గ్యాస్ రంగ షేర్లలో అత్యధికంగా అమ్మకాలు జరిగాయి.


**కుప్పకూలిన వాహన రంగ షేర్లు**

వాహన రంగ షేర్లు కుప్పకూలాయి. విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న ఎలక్ట్రిక్ వాహనాలపై దిగుమతి సుంకాన్ని తగ్గించుకునే యోచనలో కేంద్ర ప్రభుత్వం ఉండటంతో ఆటోమొబైల్ రంగ షేర్లు 6 శాతం వరకు నష్టపోయాయి. వీటిలో అత్యధికంగా మహీంద్రా అండ్ మహీంద్రా షేరు 6.07 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు టీవీఎస్ మోటర్ 3.81 శాతం, ఎక్సైడ్ ఇండస్ట్రీస్ 2.64 శాతం, అపోలో టైర్స్ 2.49 శాతం, టాటా మోటర్స్ 2.46 శాతం, అశోక్ లేలాండ్ 2.05 శాతం, హీరో మోటోకార్ప్ 1.45 శాతం, బజాజ్ ఆటో 1.40 శాతం, మారుతి సుజుకీ, ఎంఆర్‌ఎఫ్ షేర్లు కుదేలయ్యాయి. మొత్తంగా బీఎస్‌ఈ ఆటో ఇండెక్స్ 2.60 శాతం తగ్గి 48,135.22 వద్ద నిలిచింది. వీటితోపాటు అదానీ పోర్ట్స్, టాటా మోటర్స్, సన్‌ఫార్మా, పవర్‌గ్రిడ్, జొమాటో, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్బీఐ, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు కూడా నష్టపోయాయి. కానీ, టాటా స్టీల్, లార్సెన్ అండ్ టుబ్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఏషియన్ పెయింట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎన్టీపీసీ షేర్లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే ఆటో 2.60 శాతం, కన్జ్యూమర్ 1.49 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 1.42 శాతం, రియల్టీ 1.33 శాతం, టెలికం 1.19 శాతం చొప్పున పతనం చెందాయి. కానీ, మెటల్ రంగ షేర్లు లాభాల్లో ముగిశాయి.

## మల్టీలెవల్ మార్కెటింగ్ పేర 800 కోట్ల టోకరా!

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): అభయ గోల్డ్ ఇన్‌ఫ్రాటెక్ ఇండియా రూ.800 కోట్ల మోసానికి పాల్పడిందని బాధితులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం సీబీఐ, ఆర్థిక శాఖకు ఫిర్యాదు చేశారు. ప్రజల నుంచి వసూలు చేసిన సొమ్ముతో అక్రమంగా ఆస్తులు కూడబెట్టిందని, ఆ డబ్బుతోనే హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో కొత్తవెంచర్ ప్రారంభించిందని, అదే డబ్బుతో హైదరాబాద్‌లో కంట్రీమాల్‌ను నిర్మించిందని తెలిపారు. అభయ గోల్డ్ నుంచి వచ్చే డబ్బుతో మల్టీలెవల్ మార్కెటింగ్ వంటి ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని సీబీఐకి విన్నవించారు. అభయ గోల్డ్ తెలుగు రాష్ర్టాల్లో రూ.800 కోట్ల వరకు మోసానికి పాల్పడిందని, తమ వద్ద ఆధారాలున్నాయని చెప్పారు. తక్షణమే కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని సీబీఐని కోరారు. అభయగోల్డ్ ఇన్‌ఫ్రాటెక్‌కు ఒక రిటైర్డ్ జడ్జి, రిటైర్డ్ ఐపీఎస్‌ల సహకారం ఉన్నదని, కేసు నమోదు చేస్తే వివరాలన్నీ ఇస్తామని పేర్కొన్నారు.

# ప్రజాపాలనంటే ఇదేనా?



- **కేసీఆర్‌ది గడీల పాలన అన్న రేవంత్.. నువ్వు చేస్తున్నదేంది?**
- **తమది ప్రజల పాలన అంటూ గొప్పలు చెప్పుకున్నారు**
- **ఎవరైనా ఎప్పుడైనా కలవొచ్చవంటూ ఊదరగొట్టారు**
- **మాజీ ఎమ్మెల్యేనైన నన్నే సీఎం పట్టించుకోలేదు**
- **సచివాలయం, ఇంటి చుట్టూ తిప్పించుకున్నారు**
- **నాలుగుసార్లు వెళ్లినా అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు**
- **'నమస్తే తెలంగాణ'తో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య**

ఇల్లెందు, ఫిబ్రవరి 21: 'కేసీఆర్‌ది గడీల పాలన అంటూ నాటి ముఖ్యమంత్రిపై రేవంత్‌రెడ్డి నీలాపనిందలు మోపారు. తమది ప్రజాపాలన అంటూ గొప్పలు చెప్పుకున్నారు. ముఖ్యమంత్రిని ఎవరైనా ఎప్పుడైనా కలవొచ్చంటూ ఊదరగొట్టారు. అదే ప్రజల దీవెనలతో ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన నన్నే పట్టించుకోలేదు. తనను కలిసేందుకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక నాలుగుసార్లు వెళ్లా. తాజాగా రెండు రోజులపాటు సెక్రటేరియట్, సీఎం ఇంటి చుట్టూ కాళ్లరిగేలా తిరిగా. ప్రజాసమస్యలపై వినతిపత్రాలు తీసుకునేందుకు సమయం ఇవ్వలేదు. మరి ఇది ప్రజాపాలన ఎలా అవుతుంది?' అంటూ కమ్యూనిస్టు యోధుడు, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఆగ్రహం వ్యక్తంచేశారు. ఐదు పర్యాయాలు శాసనసభ్యుడిగా ఎన్నికైన గుమ్మడి నర్సయ్యకు సీఎం రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తాజా పరిణామాలపై గుమ్మడి నర్సయ్యను 'నమస్తే తెలంగాణ' పలుకరించగా అసలు వృత్తాంతాన్ని విశదీకరించారు.

***నమస్తే తెలంగాణ: సీఎంను కలిసేందుకు ఎందుకు వెళ్లారు?***

గుమ్మడి నర్సయ్య: ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఇల్లెందు ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి, సీతారామ ప్రాజెక్టు విషయంలో ఇల్లెందు నియోజకవర్గానికి జరుగుతున్న అన్యాయం గురించి ముఖ్యమంత్రికి వివరించి వినతిపత్రం అందించాలని అనుకున్నాం. అందుకోసమే అఖిలపక్ష నాయకులతో కలిసి సీఎంను కలిసేందుకు హైదరాబాద్ వెళ్లా. కానీ పాతికేళ్లపాటు ప్రజల చేత ఎన్నికై ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పాటుపడిన నాకు ఇప్పటి ముఖ్యమంత్రి కనీసం సమయం కూడా ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ పథకాలను ప్రారంభిస్తున్నప్పటికీ అవి క్షేత్రస్థాయిలో అమలుకావడంలేదనే విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాలనుకున్నా. కానీ ఎంతలా ప్రయత్నించినా నాకు అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు.

***నమస్తే: మీవెంట ఏయే పార్టీల వాళ్లు వచ్చారు?***

గుమ్మడి: ఇల్లెందు నియోజకవర్గంలో అఖిలపక్ష పార్టీలైన సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా మాస్‌లైన్, న్యూడెమోక్రసీ, బీజేపీ, టీడీపీ, సీపీఐ, సీపీఎం నియోజకవర్గస్థాయి నాయకులం కలిసి బుధవారం (ఫిబ్రవరి 19) వెళ్లాం. అలాగే, కాంగ్రెస్ నుంచి కూడా బండారి మోహన్‌రావు మా వెంట వచ్చాడు.

***నమస్తే: హైదరాబాద్‌లో ఏం జరిగింది?***

గుమ్మడి: అఖిలపక్ష నాయకులమంతా సెక్రటేరియట్‌కు చేరుకున్నాం. ముఖ్యమంత్రి వద్దకు పంపించాలని సెక్యూరిటీ సిబ్బందిని కోరాను. 'మీకు అపాయింట్‌మెంట్ లేదు. పంపించడం కుదరదు' అని చెప్పారు. 'కాకపోతే మధ్యాహ్నం తరువాత పంపిస్తాం' అన్నారు. దీంతో సాయంత్రం వరకు అక్కడే వేచి చూశాం. సాయంత్రమైనా పంపలేదు. పైగా 'రేపు సీఎం ఇంటి వద్దకు రమ్మన్నారు. అక్కడికి వెళ్లండి' అని చెప్పారు. దీంతో గురువారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని సీఎం ఇంటి వద్దకు వెళ్లాం. ఆయన ఇంటి ముందే నిలబడి ఉన్నాం. వినతిపత్రం ఇచ్చేందుకు మేం వచ్చిన విషయాన్ని అక్కడి సెక్యూరిటీ సిబ్బందికి చెప్పాం. దీంతో ఆ సెక్యూరిటీ సిబ్బంది సీఎం పీఏ జైపాల్‌రెడ్డికి ఫోన్ చేసి చెప్పారు. 'ఎవరెవరున్నారు?' అని జైపాల్‌రెడ్డి అడిగారు. 'చాలామంది ఉన్నారు. వారిలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కూడా ఉన్నాడు' అని సెక్యూరిటీ సిబ్బంది సమాధానమిచ్చారు. ఇంతలో సీఎం ఓఎస్‌డీ దినేశ్‌రెడ్డి అక్కడికి వచ్చారు. 'ముందే అపాయింట్‌మెంట్ తీసుకొని రావాలి. ఇప్పుడు పంపించడం కుదరదు' అంటూ తేల్చిచెప్పారు.

***నమస్తే: మరి తరువాత ఏం చేశారు?***

గుమ్మడి: అదే సమయంలో సీఎం కాన్వాయ్ వస్తుండడాన్ని చూశాను. ముఖ్యమంత్రికి కనిపిద్దామని ముందుకు వెళ్లాను. కానీ సెక్యూరిటీ వాళ్లు నన్ను ముందుకు వెళ్లనీయలేదు. సీఎం నన్ను చూశాడో లేదో తెలియదు. కానీ సీఎం కాన్వాయ్ వెళ్లిపోయింది. నేను తొలిసారి ఎమ్మెల్యే అయినప్పుడు ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆ తర్వాత నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పటి ముఖ్యమంత్రులందరూ నాతో ఆత్మీయంగా ఉండేవారు. నేను ఓడిపోయిన సమయంలో కూడా వైఎస్‌ఆర్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి వంటి ముఖ్యమంత్రులు ఆప్యాయంగా పలుకరించేవాళ్లు. నేను వెళ్తే అపాయింట్‌మెంట్ లేకుండానే తమ చాంబర్లలోకి తీసుకెళ్లి సమస్యలన్నీ తెలుసుకునేవారు. వినతిపత్రాలు తీసుకొని ఆయా సమస్యల పరిష్కారానికి కృషిచేసేవాళ్లు. కానీ, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం నన్ను కనీసం పట్టించుకోలేదు.

***నమస్తే: ఏయే సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలనుకున్నారు?***

గుమ్మడి: రుణమాఫీ, రైతుభరోసా, సీతారామ నీళ్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలనుకున్నా. రేవంత్‌రెడ్డిది ప్రజాపాలన కాదని తెలుసుకున్నా. కేసీఆర్‌ది గడీల పాలన అంటూ అప్పట్లో ఇదే రేవంత్‌రెడ్డి నిందలు మోపేవారు. తమది ప్రజాపాలన అంటూ ఆయన సీఎం అయ్యాక గొప్పలు చెప్పుకున్నారు. ప్రజాపాలనలో ఎవరైనా, ఎప్పుడైనా వచ్చి కలవొచ్చని, సమస్యలు చెప్పుకోవచ్చని ఊదరగొట్టారు. కానీ ఇది ప్రజాపాలన కాదని నా అనుభవంలో స్పష్టమైంది. ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన నాకే సీఎం వద్ద ఇలాంటి పరాభవం ఎదురైంది. 14 నెలల కాంగ్రెస్ పాలనలో వారి ఏ ఒక్క హామీ కూడా అమలుకాలేదు. రుణమాఫీ అందరికీ అందలేదు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేజీ రామచందర్

## గుమ్మడికి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం దారుణం

**కేజీ రామచంద్ర విమర్శ**

ముషీరాబాద్, ఫిబ్రవరి 21: ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, ప్రజలకు సేవలందించిన మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్యకు సీఎం రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం దారుణమని సీపీఐ (ఎంఎల్ )మాస్ లైన్ ఆల్ ఇండియా పార్టీ కేంద్ర బ్యూరో సభ్యుడు కేజీ రామచంద్ర విమర్శించారు. బీజేపీ ఫాసిస్టు, కార్పొరేట్ విధానాలను వ్యతిరేకంగా లౌకికవాద ప్రజాస్వామ్య ఫెడరలిజం కోసం ఈ నెల 28న సదస్సు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. విద్యా నగర్‌లోని మార్క్స్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ సభ్యులు కే రమ, ఎస్‌ఎల్ పద్మ, హన్మేష, సదానందంతో కలిసి ఆయన మాట్లాడారు. 'సబ్ కా వికాస్, సబ్ కా సాత్' అని ప్రధాని మోదీ ప్రగల్భాలు పలుకుతున్నారని, కానీ దేశంలో కార్పొరేట్ వికాస్ జరుగుతున్నదని విమర్శించారు. పేద, ధనిక వర్గాల మధ్య అసమానతలు మరింత పెరిగిపోయాయని, ప్రజల జీవన ప్రమాణాలు క్షీణించాయని ఆరోపించారు. కార్పొరేట్ వర్గాలకు రాయితీలిస్తూ, పేదలను నట్టేట ముంచుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి అమలు సాధ్యంకాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు.

## అక్రమాస్తులు అటాచ్

- ఏసీబీకి పట్టుబడిన సీపీడబ్ల్యూడీ ఈఈ

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ సీపీడబ్ల్యూడీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సాయి కొమరేశ్వర్ అక్రమాల చిట్టా బయటపడుతున్నది. ఓ బిల్లు క్లియరెన్స్ కోసం లంచం తీసుకుంటూ కొరమేశ్వర్ దొరికిపోయారు. ఏసీబీ, సీబీఐ అధికారులు కొమరేశ్వర్ ఇంట్లో సోదాలు నిర్వహించి, 30.5 లక్షలు, లాకర్ కీ స్వాధీనం చేసుకున్నారు. ఈడీ అధికారులు కొమరేశ్వర్, అతడి భార్య పద్మావతికి చెందిన 1.27 కోట్ల విలువైన స్థిరాస్తులను అటాచ్‌చేశారు. బ్యాంకుల నుంచి అన్‌సెక్యూర్డ్ రుణాలు తీసుకొని ఆస్తులు కూడబెట్టారని పేర్కొన్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నదని వెల్లడించారు.

## సంపదను చెరబట్టేందుకే ఆపరేషన్ కగార్

**పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు**



హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): అడవుల్లో నిక్షిప్తమైన సంపదను చెరబట్టేందుకే కేంద్రప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను కొనసాగిస్తున్నదని రాష్ట్ర పౌర హక్కుల ప్రధాన కార్యదర్శి నారాయణరావు ఆరోపించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. బహుళజాతి సంస్థలు, కార్పొరేట్ల గుప్పిట్లోకి వెళ్లిపోయిన జాతీయ పార్టీలు దేశంలోని సహజ సంపదను వారికి అప్పగించేందుకే 2005లో సల్వాజుడుం, 2009లో ఆపరేషన్ గ్రీన్‌హంట్, 2024లో ఆపరేషన్ కగార్ వంటి హత్యాకాండలు చేపడుతున్నాయని ధ్వజమెత్తారు. ప్రధానంగా ఛత్తీస్‌గఢ్, తెలంగాణ పరిధిలోని అడవుల్లో వజ్రాలు, ఇనుము, బొగ్గు, సున్నపురాయి, డోలమైట్, బాక్సైట్ సహా 28 రకాల ఖనిజాలు ఉన్నాయని వివరించారు. వాటిని తవ్వుకునేందుకు వివిధ కంపెనీలతో కేంద్ర ప్రభుత్వం వందకు పైగా ఎంవోయూలు చేసుకున్నదని, ఆ కంపెనీల ఒత్తిడి మేరకే 2026 నాటికి దేశంలో ఉన్న మావోయిస్టులను ఏరివేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి ప్రకటించారని తెలిపారు.

## బీజేపీ పాలనలో విద్యారంగం సంక్షోభం

- **విద్యార్థి వ్యతిరేక బడ్జెట్ తెచ్చిన కేంద్రం**
- **ఏఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు**

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తేతెలంగాణ): కేంద్రంలో బీజేపీ పాలనలో విద్యారంగం సంక్షోభంలో కూరుకుపోయిందని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్‌ఏ స్టాలిన్ ఆందోళన వ్యక్తంచేశారు. బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 2.53% కేటాయింపులు చేశారని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విద్యాసంవత్సరం ముగింపు దశకు చేరుకున్నా విడుదల చేయకుండా విద్యార్థుల భవిష్యత్తుతో సర్కారు చెలగాటం ఆడుతుందని విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 20% నిధులు కేటాయించాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

**మార్చిలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఈసీఐఎల్‌లోని లయన్స్‌క్లబ్ హాలులో మార్చి 1, 2 తేదీల్లో ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు నిర్వహించనున్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లాఖాద్రీ, కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర తెలిపారు. సమావేశాల పోస్టర్‌ను హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని యూనియన్ భవన్‌లో శుక్రవారం వారు విడుదల చేశారు.


**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on @SCRailwayindia
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

**టెండరు నోటీసు నం. 25-CWMLGDS-ET-2024-25 తేది: 21.02.2025**

PUB/0195

భారత రాష్ట్రపతి తరపున వ్యవహరిస్తున్న **చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్/లాలాగూడ** వారు టెండరు నెం. 43-CWMLGDS-ET-2024-25, ముగింపు తేది 15.03.2025 11.00 గం.వరకు కలిగిన దాని కొరకు ఇ-టెండర్లు కోరుచున్నారు. ముగింపు తేది మరియు సమయం వరకు మాత్రమే బిడ్డర్లు తమ ఒరిజినల్/మార్పు చేయబడిన బిడ్లు దాఖలు చేయగలరు. ఈ టెండరు కొరకు మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు మరియు ఏవేని అట్టి మాన్యువల్ ఆఫరు స్వీకరించిననూ అది తిరస్కరించబడును. కాంట్రాక్టర్లు నెట్ బ్యాంకింగ్, డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డ్ మొ. వంటి IREPS పోర్టల్‌లో లభించే **ఆన్‌లైన్ చెల్లింపు విధానాల ద్వారా మాత్రమే** టెండరు డాక్యుమెంటు ధర మరియు బయానా నిమిత్తం ఈ టెండరుపై చెల్లింపులు చేసేందుకు అనుమతించ బడతారు. డిమాండ్ డ్రాఫ్ట్, బ్యాంకర్స్ చెక్, డిపాజిట్ రిసీప్ట్‌లు, FDR మొదలగు వాటి ద్వారా మాన్యువల్ చెల్లింపులు అనుమతించబడవు.

**క్ర.సం.01: టెండరు నం.:** 43-CWMLGDS-ET-2024-25 **తేది:** 21.02.2025, **పని వివరణ:** సింగిల్ సైడ్ ఇన్‌స్పెక్షన్ విండోతో ఇన్‌స్పెక్షన్ క్యారేజ్ మరియు అబ్జర్వేషన్ కార్‌లోకి కోచెస్ యొక్క కన్వర్షన్. **సుమారు విలువ:** రూ. 1,06,91,363.32, (ఒక కోటి ఆరు లక్షల తొంబై ఒక లక్షల మూడు వందల అరవై మూడు రూపాయల ముప్పై రెండు పైసలు మాత్రమే) **బయానా:** రూ. 2,03,500/-(రెండు లక్షల మూడు వేల ఐదు వందల రూపాయలు మాత్రమే), **పూర్తి చేయుకాలం:** 6 నెలలు, ముగింపు తేది: 15.03.2025న 11.00 గం.లు.

**వెబ్‌సైట్ వివరాలు :** www.ireps.gov.in

**టెండరు పూర్తి వివరాలు చూసేందుకు నోటీస్ బోర్డ్ గల ప్రదేశం:** చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ కార్యాలయం, క్యారేజ్ వర్క్‌షాప్, లాలాగూడ, సికింద్రాబాద్-500017.

తదుపరి టెండర్ నిబంధనలు/వివరాలు (టెండర్ డాక్యుమెంట్స్‌లో లభిస్తాయి) మరియు టెండర్ డాక్యుమెంట్ల డౌన్‌లోడ్, సవరణ కొరకు మా వెబ్‌సైట్: https://www.ireps.gov.in ను దర్శించండి.

**చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్, CWS, లాలాగూడ, సికింద్రాబాద్**

**No.Dy.CEE-GS-BZA-22-2024-25 Dt.20-02-2025 (ireps.gov.in ద్వారా)**

PUB/0196

దిగువ పనుల కొరకు భారత రాష్ట్రపతి తరపున చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్, గతి శక్తి, దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ వారు ఓపెన్ టెండర్/సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో ఇ-టెండరు కోరుచున్నారు.

1, టెండర్ నెం. : BZA-GSU-Elec-22-2024-25, **తేది:** 13.02.2025, **పని వివరణ:** విజయవాడ డివిజన్‌లో తొల్లపాడు (GLP) యార్డ్ వద్ద ప్రతిపాదిత అప్ లూప్ లైన్ కొరకు 25kv కన్వెన్షనల్ టైప్-రెగులేటెడ్ OHE ఏర్పాటు. **టెండర్ విలువ:** రూ. 20006612.30 **బయానా:** రూ. 250000, **పూర్తి చేయు కాలము:** 9 నెలలు. **టెండరు ఫారం ధర :** లేదు. **ముగింపు తేది:** 10-03-2025, 15.00గం.కు.

1. బిడ్ డాక్యుమెంటు మరియు ఇతర వివరాల కొరకు దయచేసి వెబ్‌సైట్ **https://ireps.gov.in** కు లాగిన్ అవ్వండి.
2. బయానా మరియు టెండర్ డాక్యుమెంట్ ధరను IREPSలో ఆన్‌లైన్‌లో లభించే నెట్ బ్యాంకింగ్/ పేమెంట్ గేట్‌వే సదుపాయాల ద్వారా చెల్లించాలి (లేదా) మ్యానువల్‌గా బిడ్ సెక్యూరిటీ నిమిత్తం బ్యాంక్ గ్యారంటీని సీనియర్ డివిజినల్ ఫైనాన్స్ మేనేజర్, ఎస్‌సి రైల్వే, విజయవాడ పేరున దాఖలు చేయవలెను.
3. టెండరు దాఖలు చేయు / బిడ్డింగ్ కాలవ్యవధిలో అనగా టెండరు ముగింపుకు ముందస్తుగా పదిహేను రోజుల్లోగా టెండరుదారులు తమ ఆఫర్లను ఆన్‌లైన్‌లో దాఖలు చెయ్యాలి.
4. టెండరు దాఖలుచేయు / బిడ్డింగ్ కాలవ్యవధి యొక్క ప్రారంభ తేదీ వరకు టెండరుదారు ఏదేని సవరణ (ఆన్‌లైన్‌పై మాత్రమే జారీచెయ్యబడును) కొరకు గమనించగలరు.

**డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/గతిశక్తి/విజయవాడ**

**ఓపెన్ ఇ-టెండర్ ప్రకటన**

PUB/0197

దిగువ తెలిపిన పనుల కొరకు 14.03.2025న తేదీన 15.30 గం.వరకు దిగువ సంతకందారు భారత రాష్ట్రపతి తరపున ఇ-టెండర్ కోరుచున్నారు.

టెండర్ నోటీస్ నెం.SCR-BZA-SnT-E33-OT-24-25, తేది: 21.02.2025 పని పేరు: విజయవాడ డివిజన్: విజయవాడ డివిజన్‌లో కి.మీ.143/32-34 వద్ద LC No.102, కి.మీ.440/22-24 వద్ద LC No.319, కి.మీ.728/24-26 వద్ద LC No.477, కి.మీ.750/32-751/02 వద్ద LC No.489 స్థానంలో ప్రతిపాదిత ROB నిర్మాణంకు సంబంధించి S&T పనులు. టెండర్ విలువ: రూ.2,78,37,436.20, బయానా: రూ.2,89,200 ఆన్‌లైన్ లేదా బిడ్ సెక్యూరిటీ ద్వారా మాత్రమే, పూర్తి చేయు కాలం: 365 రోజులు, CTB: లేదు.

1. **ముగింపు** తేది **మరియు సమయం:** 14.03.2025న 15.30 గం.

కాగోరు టెండర్‌దారులు ఏదేని టెండర్‌కు మార్పులు/సవరణను గమనించుటకు టెండర్ ముగింపు తేదీకి ముందు వెబ్‌సైట్ www.ireps.gov.inను దర్శించవలసిందిగా సూచించబడుచున్నారు.

**డివిజినల్ రైల్వే మేనేజర్ (S&T), విజయవాడ**

**టెండరు ప్రకటన నం. NED/E-37/2024-25 తేది: 20.02.2025**

PUB/0198

దిగువ ఇ-టెండర్ల @ www.ireps.gov.in కోసం ఆఫర్లు కోరబడుతున్నవి.

**క్ర.సం.01:** NED/E-37/2024-25: **పని పేరు:** 1) నాందేడ్ డివిజన్‌లో LC గేట్ నం.లు. 7,53,39,83,99,77,125,129, 121, 163, 29& 171 వద్ద ఎలక్ట్రికల్లీ ఆపరేటెడ్ లిఫ్టింగ్ బ్యారియర్‌తో మెకానికల్లీ ఆపరేటెడ్ లిఫ్టింగ్ బ్యారియర్ యొక్క రీప్లేస్‌మెంట్ 2) నాందేడ్ డివిజన్‌లో LSR-POZ స్టేషన్ల మధ్య LC 37, BMF-MRV మధ్య LC 168, BDU- జాల్నా స్టేషన్ల మధ్య LC నం. 72 యొక్క ఇంటర్‌లాకింగ్ సంబంధించి ఎలక్ట్రికల్ అరేంజ్‌మెంట్స్ యొక్క ఏర్పాటు. **సుమారు విలువ:** (రూ.) 84,73,664/- **బిడ్ సెక్యూరిటీ :** రూ. 1,69,500/- **ఆఫర్ చెల్లుబాటు:** 60 రోజులు. **పూర్తిచేయు కాలం:** 12 నెలలు, **లభ్యత:** www.ireps.gov.in నాందేడ్ డివిజన్ అడ్మినిస్ట్రేషన్ క్రింద, **ముగింపు తేది మరియు సమయం:** 17.03.2025న 15.00 గం.లు.

టెండరు డాక్యుమెంట్, అర్హతా ప్రమాణాలు, ప్రత్యేక నిబంధనలు మొ.న వాటి కోసం మా పై వెబ్‌సైట్‌లో తెలుపబడినవి. ఆఫర్ దాఖలుకు ముందు ఆన్‌లైన్‌లో ఏదేని సవరణ ప్రచురించబడితే తనిఖీ చేయాలని సూచించడమైనది.

డివిజినల్ రైల్వే మేనేజర్(ఎలక్ట్రికల్), నాందేడ్

A0249

**తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in దర్శించండి.**